25052025-DIS-04_Layout 1 5/25/2025 5:27 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

గోదావరిలో కృష్ణా బేసిన్ ఎత్తుగడ

శ్రీధర్‌రావు దేశ్‌పాండే
94910 60585

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత 200 టీఎంసీల గోదావరి జలాలను పోలవరం ద్వారా కృష్ణా బేసిన్‌కు తరలించి, అక్కడి నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కాంప్లెక్స్ ద్వారా పెన్నా బేసిన్‌లో ఉన్న రాయలసీమ ప్రాజెక్టులకు తరలించే ప్రాజెక్టును రూపకల్పన చేశారు. ఈ తోవలో 150 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బొల్లపల్లి వద్ద ఒక భారీ కృత్రిమ జలాశయాన్ని నిర్మించడానికి ప్రతిపాదించారు. రూ.80 వేల కోట్లు ఖర్చు అయ్యే ఈ గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించాలని కేంద్రప్రభుత్వాన్ని చంద్రబాబు కోరిన వెంటనే అందుకు మోదీ సర్కారు సానుకూలంగా స్పందించింది. దీంతో ఈ ప్రాజెక్టు ప్రభావాలపై తెలంగాణలో చర్చ మొదలైంది. 'మీరు వాడుకోలేని నీళ్లను, సముద్రంలోకి వృథాగాపోతున్న నీళ్లను మేము వినియోగించుకోవాలని అనుకుంటే తెలంగాణకు అభ్యంతరం దేనికి?' అని చంద్రబాబు వాపోతున్నారు. 'మీరు కాళేశ్వరం ప్రాజెక్టును కట్టుకుంటే మేము వ్యతిరేకించామా?' అని కూడా అంటున్నారు.

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రభావాలు తెలంగాణ మీద ఏ విధంగా ఉండబోతున్నాయన్న అంశాన్ని చర్చించే ముందు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఏమున్నదో చూద్దాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం-2014 ప్రకారం రెండు రాష్ట్రాలు ఏదైనా కొత్త ప్రాజెక్టు చేపట్టినప్పుడు గోదావరి/కృష్ణా బోర్డుల అనుమతి, ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరిగా పొందాలి. చట్టంలోని ఈ నిబంధనని ఉటంకిస్తూ గతంలో చంద్రబాబు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి, ఆర్ విద్యాసాగర్‌రావు డిండి, సీతమ్మసాగర్, తుమ్మిళ్ల, భక్త రామదాసు తదితర ప్రాజెక్టులపై కేంద్రానికి ఫిర్యాదులు చేసిన సంగతి ఆయన మరచిపోయినా తెలంగాణ సమాజం మరచిపోదు. ఇవి ఉమ్మడి రాష్ట్రంలో నాటి ప్రభుత్వాలు రూపొందించిన ప్రాజెక్టులే అయినా వీటికి కృష్ణా/గోదావరి బోర్డుల అనుమతులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేదని, వాటిని వెంటనే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి, బోర్డులకు ఫిర్యాదులు చేసింది చంద్రబాబే. పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో, సుప్రీంకోర్టులో ఆంధ్రా రైతులతో కేసులు వేయించి, పనులను అడ్డుకోవడానికి ఆయన చేయని ప్రయత్నం లేదు.

కేంద్ర ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చిన కాళేశ్వరం ప్రాజెక్టును కూడా చంద్రబాబు అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. కేంద్రం ఇచ్చిన అనుమతులు అక్రమమని, వాటిని రద్దు చేయాలని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు 2018 జూన్‌లో లేఖ రాశారు. ఈ లేఖలో కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర విభజన తర్వాత చేపట్టిన ప్రాజెక్టు కనుక గోదావరి బోర్డు పరిశీలనకు ప్రాజెక్టు డీపీఆర్‌ను పంపించకుండానే, ఆ తర్వాత అపెక్స్ కౌన్సిల్ అనుమతి పొందకుండానే కేంద్ర ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చిందని ఆరోపించారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ప్రాజెక్టుకు అనుమతి మంజూరు చేయడం అభ్యంతరకరమని, ఆ అనుమతిని తమ సమక్షంలో తిరిగి సమీక్షించాలని కోరారు. అంతవరకు కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ఆపివేయించాలని ఆ లేఖలో కోరారు. అన్ని అనుమతులు ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ఆపాలని లేఖ రాయడం చంద్రబాబు కుటిలబుద్ధికి నిదర్శనం. ఇప్పుడు 'కాళేశ్వరం ప్రాజెక్టును మేము వ్యతిరేకించామా?' అని జూటా మాటలు మాట్లాడుతున్నారు.

మరోవైపు ఎలాంటి అనుమతులు లేకుండానే పట్టిసీమ, పురుషోత్తపట్నం, ముచ్చుమర్రి, గుండ్రేవుల, గాజులదిన్నె, గురు రాఘవేంద్ర, పులికనుమ, సిద్దాపురం, శివభాష్యం, మున్నేరు, పెన్నా-అహోబిలం ఎత్తిపోతల పథకాలు చేపట్టింది చంద్రబాబు ప్రభుత్వం. ఆనాడు రూపకల్పన చేసిన గోదావరి-పెన్నా లింకు పథకం ఇప్పుడు గోదావరి- బనకచర్ల లింకు పథకంగా కొత్త రూపం సంతరించుకున్నది.

కాబట్టి ఆయనే చెప్పినట్టు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం చంద్రబాబు గోదావరి-బనకచర్ల లింకు పథకం డీపీఆర్‌ను గోదావరి బోర్డుకు సమర్పించాలి. డీపీఆర్ ప్రతిని పరిశీలన కోసం తెలంగాణ ప్రభుత్వానికి పంపించాలి. గోదావరి బోర్డులో చర్చ జరిగిన తర్వాత అపెక్స్ కౌన్సిల్‌లో చర్చకు పెట్టాలి. అపెక్స్ కౌన్సిల్ అనుమతి పొందిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలి. ఇవేవీ చేయకుండా నేరుగా ప్రాజెక్టు పనులు చేపట్టడం, అందుకు కేంద్రం నిధులు సమకూర్చడం చట్ట విరుద్ధం. ఇది మొదటి అంశం.

ఇకపోతే చంద్రబాబు అంటున్నట్టు మనం వినియోగించుకోలేని నీళ్లను, సముద్రంలోకి నిరుపయోగంగా పోతున్న గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్ కరువు ప్రాంతాలకు తరలించుపోతానంటే తెలంగాణకు అభ్యంతరం ఎందుకు ఉండాలి? అన్న ప్రశ్న సామాన్య జనాలకు సబబే కదా అనిపించక మానదు. అయితే ఇది లోతుగా పరిశీలించవలసిన అంశం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే గోదావరి జలాల పున:పంపిణీ కోసం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద పరిష్కార చట్టం, 1956 సెక్షన్ 3 కింద గోదావరి ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రానికి అర్జీ పెట్టుకున్నది. వారి అర్జీని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నది. తెలంగాణ సహా గోదావరి బేసిన్ రాష్ట్రాల అభిప్రాయాలను సేకరిస్తున్నది. రేపోఎల్లుండో గోదావరి ట్రిబ్యునల్ ఏర్పాటవడం ఖాయం. అంతకుముందే ఏపీ 200 టీఎంసీల నీటిని వినియోగించే గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు పనులను ప్రారంభించి రూ.వేల కోట్లు ఖర్చు చేసి గోదావరి ట్రిబ్యునల్ ముందు 200 టీఎంసీల నీటిని జీబీ లింకు ప్రాజెక్టుకు కేటాయించాలని వాదించే అవకాశం ఉన్నది. ఇప్పుడు అమల్లో గోదావరి ట్రిబ్యునల్‌లో పొందుపరచిన 10 అంతర్రాష్ట్ర ఒప్పందాల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లెక్కగట్టిన 1486 టీఎంసీలలో తెలంగాణ ప్రాజెక్టులకు 969 టీఎంసీలను కేటాయించారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో వాస్తవ వినియోగం 200 టీఎంసీలకు మించలేదు. కేటాయింపులు కాగితాల మీదనే ఉన్నాయి. కొన్ని ప్రాజెక్టులు అసంపూర్ణంగా ఉండిపోవడంతో తెలంగాణ తన వాటాను సంపూర్ణంగా వినియోగించుకోలేకపోయింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గోదావరి జలాలను సంపూర్ణంగా వినియోగించుకోవడానికి కాళేశ్వరం, సమ్మక్క బ్యారేజీ, సీతమ్మ సాగర్, చనాక కోరాట ప్రాజెక్టులను చేపట్టింది. దేవాదుల, కుప్రం భీం తదితర పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసింది. గోదావరి ప్రాజెక్టులన్నిటికి కేంద్ర జల సంఘం నుంచి అనుమతులు సాధించుకున్నది. గోదావరి బేసిన్‌లో తెలంగాణ వాటా 969 టీఎంసీలను ఏపీ సదా వ్యతిరేకిస్తూనే ఉన్నది. అదే సమయంలో ఏపీ తన వాటా 775 టీఎంసీలని పేర్కొంటున్నది. గోదావరి జలాల్లో వాటాలు తేల్చడానికి ట్రిబ్యునల్ వేయాలని ఇప్పటికే కేంద్రాన్ని ఏపీ కోరింది కనుక, గోదావరి ట్రిబ్యునల్ ఎప్పటికైనా ఏర్పడే అవకాశముందన్న సంగతి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రహించారు.

పైన తెలిపిన పరిస్థితుల నేపథ్యంలో గోదావరి జలాల్లో ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించిన 969 టీఎంసీల నికర జలాలపై, గోదావరిలో వానకాలంలో లభ్యమయ్యే అపారమైన వరద జలాలపై తెలంగాణ హక్కులను ట్రిబ్యునల్ ఏర్పడకముందే స్థిరపరిచే దిశగా ముందుచూపుతోనే కాళేశ్వరం మూడో టీఎంసీ పనులను చేపట్టాలని, 36 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో సీతమ్మ సాగర్ బ్యారేజీని నిర్మించాలని కేసీఆర్ నిర్ణయించారు.

కేసీఆర్ ప్రభుత్వం చొరవ వల్ల 969 టీఎంసీల నికర జలాల్లో ఇప్పటికే 950 టీఎంసీలకు పైగా కేంద్ర జల సంఘం నుంచి హైడాలజీ క్లియరెన్సులు పొందడం విశేషం. ఇంకా సమ్మక్కసాగర్ (47 టీఎంసీలు), కాళేశ్వరం 3వ టీఎంసీ, వార్ధా (12 టీఎంసీలు) ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు రావలసి ఉన్నది. ఈ స్థితిలో ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ ప్రాజెక్టులకు చేసిన 969 టీఎంసీల నీటిపై హక్కులు స్థిరపరచుకోకుండా ఆంధ్రప్రదేశ్ చేపట్టే ఏ కొత్త ప్రాజెక్టునైనా అనుమతించడం ఆత్మహత్యా సదృశం కాగలదు.

ఇక్కడ కృష్ణా బేసిన్ అనుభవాలను మనం విశ్లేషించుకోవాలి. ఆనాడు బచావత్ ట్రిబ్యునల్ ఏపీలో ముందే వినియోగంలో ఉన్న నీటికి రక్షణలు కల్పించిన కారణంగానే బేసిన్ పెరామీటర్లలో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఆంధ్రపదేశ్ వెనుకబడి ఉన్నప్పటికీ 811 టీఎంసీల పెద్ద వాటాను సాధించుకోగలిగింది. బచావత్ ట్రిబ్యునల్ గడువు 2000 మార్చిలో ముగిసిపోతుందని అన్ని రాష్ట్రాలకు ముందే తెలుసు కాబట్టి, కొత్త ట్రిబ్యునల్ ముందు తమ నీటి హక్కులను స్థిరపరచుకోవడానికి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యతనిచ్చి, నిధులు కేటాయించి ప్రాజెక్టులను నిర్మించుకున్నాయి. ఆంధ్రపదేశ్ కూడా వరద జలాలపై ఆధారపడిన రాయలసీమ ప్రాజెక్టులను ఆగమేఘాల మీద పూర్తిచేసింది. తెలంగాణలో కూడా వరద జలాలపై ఆధారపడిన ఎత్తిపోతలు.. ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు ప్రారంభమైనా అవి పెండింగ్ ప్రాజెక్టులుగానే మిగిలిపోయాయి. వరద జలాల కేటాయింపులతో మంజూరైన డిండి, పాలమూరు ఎత్తిపోతల పథకాలు అమలు కాకుండానే అటకెక్కాయి. కృష్ణా ట్రిబ్యునల్ అనుభవాల నుంచే కేసీఆర్ ప్రభుత్వం కూడా గోదావరి బేసిన్‌లో నీటి హక్కులను స్థిరపరచుకునే ఆలోచనతోనే కాళేశ్వరం మూడో టీఎంసీ, సీతమ్మ సాగర్ బ్యారేజీ పనులను చేపట్టడం, ప్రాజెక్టులకు కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు సాధించడంపై దృష్టిపెట్టింది. కృష్ణా బేసిన్‌లో వేసిన ఎత్తుగడతోనే ఇప్పుడు చంద్రబాబు ముందుకు సాగుతున్న సంగతిని తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలి.

మరొక ముఖ్యమైన డిమాండ్‌ను కూడా గోదావరి బోర్డు ముందు, కేంద్ర ప్రభుత్వం ముందు తెలంగాణ ఉంచడం అవసరం. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కుడి కాలువ ద్వారా కృష్ణా డెల్టా అవసరాలకు తరలించుకోవచ్చు. ఆ మేరకు కృష్ణా నీటిని నాగార్జునసాగర్ ఎగువన పోలవరం ప్రాజెక్టును కేంద్ర జల సంఘం అనుమతించిన రోజు నుంచే మహారాష్ట్ర 14 టీఎంసీలు, కర్ణాటక 21 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 45 టీఎంసీలను బేసిన్‌లో ఉండే ఆయకట్టు అవసరాలకు, తాగునీటి అవసరాలకు వినియోగించుకోవచ్చు. రాష్ట్ర విభజన తర్వాత నాగార్జునసాగర్ ఎగువన తెలంగాణ రాష్ట్రమే ఉన్నది కనుక ఉమ్మడి ఏపీకి కేటాయించిన 45 టీఎంసీలు తెలంగాణకే చెందుతాయి. అందుకే ఈ నికర జలాలను పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించడం జరిగింది.

గోదావరి అవార్డులోనే 80 టీఎంసీలకు మించి గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించినట్టయితే ఆ నీటిలో కూడా అదే నిష్పత్తిలో.. అంటే 45:21:14 నిష్పత్తిలోనే కృష్ణా జలాల్లో వాటాను ఎగువ రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర డిమాండ్ చేయవచ్చు. ఇప్పుడు ఏపీ 200 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు, అటు నుంచి పెన్నా బేసిన్‌కు తరలించుకుపోతున్నది కనుక గోదావరి అవార్డు ప్రకారం కృష్ణా జలాల్లో అదనంగా 112.5 టీఎంసీల వాటాను డిమాండ్ చేయవచ్చు.

ఈ వాటాకు ఏపీ అంగీకరిస్తే గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణ అంగీకరించే అంశాన్ని పరిశీలించవచ్చు. తెలంగాణ ఎల్లప్పుడూ గివింగ్ ఎండ్‌లో, ఏపీ రిసీవింగ్ ఎండ్‌లో ఉండడానికి వీలు లేదు. ఇప్పుడు కృష్ణాలో నీటి వాటాను పొందడానికి తెలంగాణ ప్రభుత్వం ఏపీ సర్కార్‌ను డిమాండ్ చేస్తుందా? లేదా గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు మౌనంగా అంగీకారం తెలియజేస్తుందా? అనే విషయాన్ని తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తూ ఉండాలి. అప్రమత్తతే మనకు శ్రీరామ రక్ష.

(వ్యాసకర్త: విశ్రాంత సూపరింటెండింగ్ ఇంజినీర్)

ఖండాంతరాలు దాటిన తెలంగాణ ఖ్యాతి

భాస్కర్ పిన్న

తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా ఉద్యమం నుంచి పురుడుపోసుకున్న పార్టీ బీఆర్ఎస్. కేసీఆర్ నాయకత్వంలో శాంతియుతంగా ఉద్యమాన్ని నడిపి, తెలంగాణ ప్రజలను ఏకం చేసి, వారిలో విశ్వాసాన్ని నెలకొల్పి ఎన్నో కష్టాలకు ఎదురొడ్డి, ఎన్నో అవమానాలను ఎదుర్కొని, ఎన్నెన్నో దీక్షలు చేసి, సమైక్య లాబీయింగ్‌ను జయించి, దేశాన్ని ఒప్పించి స్వరాష్ట్రాన్ని సాధించిన గులాబీ పార్టీ 25వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ శుభ సందర్భంలో బీఆర్ఎస్ వ్యవస్థాపకులు కేసీఆర్‌కు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, మాజీ మంత్రి హరీశ్‌రావుకు, నాయకులకు, కార్యకర్తలకు తెలంగాణ ఎన్నారైల తరపున నా హృదయపూర్వక వందనాలు!

కేసీఆర్ నాయకత్వంలో దశాబ్ద కాలం పాటు తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పరుగులు పెట్టింది. తెలంగాణను ఒక అగ్రగామి రాష్ట్రంగా, దేశానికి రోల్‌మోడల్‌గా కేసీఆర్ నిలిపారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందినప్పటికీ తెలంగాణ శ్రేయస్సే ప్రథమ కర్తవ్యంగా గులాబీ పార్టీ అహర్నిశలు శ్రమించింది. నిత్యం తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం అలుపెరగకుండా కృషి చేసింది. తెలంగాణలో హనుమంతుని గుడి లేని ఊరు లేదు, సంక్షేమ ఫలాలు అందని కుటుంబం లేదనే రీతిలో కేసీఆర్ పాలించారు. నాడు అధికారంలో ఉన్నా, నేడు ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ ప్రజలకు గులాబీ జెండా అండగా నిలుస్తున్నది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అమెరికాతో అవినాభావ సంబంధం ఉంది. కేటీఆర్ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివారు. ఉద్యోగం చేసుకుంటూ అక్కడే స్థిరపడతామని అనుకుంటున్న సందర్భంలో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. దీంతో ఉద్యమ ఆవశ్యకతను

గుర్తించి ఉద్యమ రథసారథి కేసీఆర్‌కు అండగా ఉండాలని తన ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణకు వచ్చేశారు. రాష్ట్ర సాధనోద్యమంలో భాగస్వాములయ్యారు. కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎన్నారై విభాగం ఎప్పటికప్పుడు తెలంగాణ గళాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఖండాంతరాలకు విస్తృతం చేసింది. ప్రపంచం నలుమూలల్లో నివసిస్తున్నప్పటికీ తెలంగాణే మా తొలి ప్రాధాన్యం.

స్వరాష్ట్రం ఏర్పడ్డాక కూడా పార్టీ పిలుపునిచ్చిన అనేక కార్యక్రమాలను ఎన్నారైలు విజయవంతం చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సందర్భంగా పార్టీతో మాకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ గర్విస్తున్నాం. కేసీఆర్ నాయకత్వంలో, కేటీఆర్ మార్గనిర్దేశంలో తెలంగాణకు, పార్టీకి సేవలు చేస్తూనే ఉంటాం. ఎన్నారై విభాగం ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే ఉంటాం.

రాష్ట్ర సాధన ఉద్యమం, పదేండ్ల పునర్నిర్మాణం వెరసి బీఆర్ఎస్ 25వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా తెలంగాణలోనే కాకుండా ఖండాంతరాల్లోనూ రజతోత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా జూన్ 1న యూఎస్ఏలోని డల్లాస్‌లో చరిత్రలో నిలిచిపోయేలా వేడుకలు జరిపేందుకు బీఆర్ఎస్ యూఎస్ఏ విభాగం, అడ్వైజరీ చైర్మన్ మహేష్ తన్నీరు నాయకత్వంలో వేడుకలకు కావలసిన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల, దిలీప్ కొణతం, శ్రీనివాస్ సురకంటి, శ్రీనివాస్ వీటిని పర్యవేక్షిస్తున్నారు.

విదేశాల్లో తెలంగాణ వాణిని వినిపించేందుకు, మన ఘనతలను ఖండాంతరాలకు చాటేందుకు డల్లాస్ వేదిక కానున్నది. తెలంగాణ అవతరణ దినోత్సవాలు, రజతోత్సవాల్లో భాగంగా మన సంస్కృతి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద గేయాలు, బతుకమ్మ, కోలాటం తదితర కార్యక్రమాలు ఈ వేడుకల్లో నిర్వహించనున్నారు. అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న తెలంగాణవాదులు, కేసీఆర్, బీఆర్ఎస్ అభిమానులు కుటుంబసభ్యులతో సహా విచ్చేసి తెలంగాణ పండుగను విజయవంతం చేయాలని మనవి.

(వ్యాసకర్త: డెలావేర్, యూఎస్ఏ)



పుస్తకావిష్కరణ

పల్లె సౌందర్య జీవనాన్ని, బాల్యాన్ని తలపోస్తూ, కోల్పోయిన వృత్తుల గత గ్రామీణ కాలాన్ని తలుచుకొని తనువెల్లా వలపోస్తూ విశ్వనాథుల పుష్పగిరి రచించిన 'గండదీపం' కవితా సంకలనం ఆవిష్కరణ సభ ఆదివారం 2025 మే 25న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం మెయిన్ హాల్‌లో జరుగనున్నది. ఆత్మీయ అతిథిగా గోరటి వెంకన్న హాజరుకానున్నారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ అంబటి సురేంద్ర రాజు ఆవిష్కరిస్తారు. రమేష్ హజారే పుస్తక సమీక్ష చేస్తారు.

పిచ్చెక్కి 19 వేల మంది చిన్నారులను చంపారు!

ఏడాదిన్నరగా జరుగుతున్న యుద్ధంలో గాజాలోని 19 వేల మంది చిన్నారులను మీరు (ఇజ్రాయెల్) పొట్టనబెట్టుకున్నారు. 53 వేల మందిని చంపారు. యూనివర్సిటీలు, దవాఖానలను ధ్వంసం చేశారు. అయినా ఎందుకు సంతోషంగా లేరు? ఎందుకిలా పిచ్చెక్కినట్టు ప్రవర్తిస్తున్నారు? ఎందుకంటే, రాజకీయంగా విజయం సాధించామనే భావన మీకు కలగడం లేదు.

- ఐమన్ ఓదే, ఇజ్రాయెల్ ఎంపీ

సామాన్యుడి మాట

మలేషియా బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్, చిత్రంలో గురిజాల రాజేశ్వర్, తదితరులు...

మలేషియా ఏజెంట్ మీద మన్ను వడ..!

ఆ మలేషియా ఏజెంట్ మీద మన్నువడా.. అన్ని నమ్ముకొని వోయినందుకు నా బతుకు పెనం మీంచి పొయ్యిల వడ్డట్టయ్యింది. పొయ్యంటే మతికొచ్చింది, మలేషియాలోని మలాక సిటీనే నా ఇలాక. అక్కడ అల్యూమినియం కంపెనీల పన్జేసేటోన్ని. నేను పొయ్యి కింద మంటవెడ్తనే పైన అల్యూమినియం కరగి నీళ్ల లెక్క అయ్యేది. పొయ్యి నుంచి అచ్చే శెకకు నేన్గూడ మాడి మసయ్యేటోన్ని. ఆ కంపెనీలనే బువ్వ దిని, ఆ కంపెనీలనే నిర్దవోయేటోన్ని. పొద్దుగాళ్ల పోవుడు, పొయ్యిల కొర్కాసులు ఎగదోసుడు, పొద్దూకి రూంకు వచ్చి ఇంత సల్లవడి నడుమాల్సుడు. రోజిదే పని.

ఎప్పట్లెక్కనే ఆ రోజు గూడ అదే పనికి వొయిన. మజ్జాన్నం మూడు గొడ్డున్నది. అక్కడి సీఐడీ పోలీసులట, మా కంపెనీల దొంగలు వడ్డట్టే ఉర్కచ్చిర్రు. ఏ మన కోసం గా పోలీసులెందుకస్తరని నా పని నేన్జేసుకుంటున్న. ఖతం రానే అచ్చిర్రు నా దగ్గరికి పోలీసులు. 'గురిజాల రాజేశ్వర్ నువ్వేనా' అని మలయి భాషలడిగిర్రు. 'నేనే' అన్జెప్పిన. అంతే..'పోదాం పా' టేషన్‌కు అని నన్ను వట్కపోయిర్రి. నేనేం దొంగతనం జెయ్యలె, లేకుంటే మలేషియా మనిషిని మర్డర్ జెయ్యలె. మరె, పోలీసులు నన్నెందుకు వట్కపోయిర్రో తెలుసా..? దొంగ వీసా మీద అక్కడ బతుకుతున్ననట. ఆ విషయం అప్పటిదాన్క నాగ్గూడ తెల్వదు. ఏజెంటును నమ్ముకొని డెబ్బై వేల రూపాలు ఆయన శేతిల వెడ్తే ఈ పనికి కుదిరిపిచ్చిండు. నేనేం జెప్పినా పోలీసులు ఇన్నేదు. వాళ్లసుకున్న పన్జేసిర్రు. ఆ రోజు నాత్రంతా పోలీస్టేషన్లనే పండుకున్న గనీ నిర్దవడితే ఒట్టు. నా పెండ్లాం సత్తవ్వ, కొడుకు వినయ్, బిడ్డ మానసలే గర్తురావట్టిర్రు. 'మన కొడుక్కు పానం మంచిగలేదు, డాక్టర్లు ఆప్రేషన్ జేస్తనే మంచిదంటున్నరు', 'డాక్టర్లకన్న మనకెక్కువ ఎరుకనా? నేన్ పైసల్ పంపిస్తా, నువ్వేం రందివడకు. ముందుగాళ్ల వాన్నైతె దావకాన్ల షరీఖ్ జెయ్యి'మని అదేరోజు పొద్దున ఫోన్ల సత్తవ్వతోని జెప్పిన ముచ్చట యాదికొచ్చి కండ్ల పొంటి నీళ్లు వట వటా రాలవట్టినయి. నాత్రంత నిలవడ్డ కన్లు నిలవడ్డట్టే ఉన్నయి గని నిర్ద మాత్రం వట్టలె. కతం, తెల్లారనే తెల్లారె..

అరెస్టయిన ముచ్చట ఒక్కపారి ఫోన్జేసి చెప్తే మంచిగుండని పానం ఇంటిమొకాన గుంజింది. కనీ, మనకు ఫోన్ ఇచ్చేటోళ్లెవ్వల్లేరాయె! ఇంతల, దేవునిలెక్క రానే అచ్చిండు ఓ పెద్ద మనిషి. ఆ పెద్దాయన ఫోన్లకెళ్లి వినయ్‌కి ఫోన్జేసిన. 'నాన్న.. ఇగో, ఇప్పుడే ఆప్రేషన్ రూంలకు వోతున్న' అని నా అరెస్టు ముచ్చట చెప్పకముందే వాడు, వాని గురించి చెప్పవట్టిండు. పోరడు బెంగటీలదిక్క అని 'ఏం గాదు బిడ్డ, ధైర్యంగుండు, ఫోన్ అమ్మకియ్యి'మన్న. ఫోన్దీసుకున్న సత్తవ్వకు.. 'నేను ఫోన్జేత్తలేనని రందివెట్టుకోకు, పోరగాండ్లు జాగర్త' అని నేను అరెస్టయిన ముచ్చట జెప్పిన. ఆ ఫోన్లనే ఏడ్వవట్టింది సత్తవ్వ. 'ఎవ్వొ ఊకో.. ఏం గాదు, ఎందుకేడుస్తున్నవ్' అని ధైర్యం జెప్పంగనే పోలీసాయన అచ్చి ఫోన్ గుంజుకున్నడు. తీస్కపాయి లాకప్లేసిండు.

మలేషియాల కేసు ఫైలయ్యేదాన్క లాకప్‌లేస్తరు. కేసు ఫైలయినంక జైలుకు పంపుతరు. లాకప్ నుంచి కోర్టుకు, కోర్టు నుంచి లాకప్‌కు పోలీసులు పదిహేడు రోజులు తిప్పిర్రు. ఒక లాకప్‌ల ఎనిమిది మంది ఉంటరు. లాకప్ మొత్తం శిమ్మశీకటి, ఒగని భాష ఒగనికి రాదు. పదిహేడు రోజుల తర్వాత కేసు ఫైలైంది. మమ్మల్ని ఇడ్సిపెడ్తదనుకున్న కోర్టు జైలుకు పంపింది. అమ్మో... అసొంటి కట్టం పగోనిగ్గూడ రావద్దు. ఆ జైలు ఎట్లుంటదంటే..? కోళ్ల ఫారం కన్న అటీనముంటది. శిమ్మశీకటి, గొర్లను గదా ఏసినట్టు ఒక్క ఫారంల ఎనభై మందినేసిర్రు. తిండి, గిండీ అన్లి అన్లనే. నీళ్ల లెక్క ఉండే సాస్‌తోని రోజుకు రెండు పూటల బువ్వ సగం కడుపుకే వెట్టిర్రు. అన్ల కొంచెం ఎక్కువ బలమున్నోడు పళ్లెం గుంజుకొని తిన్నా మనం జేసేదేం ఉండదు. నేనొక్కన్నే గాదు, మొత్తం ఆరుగురుం, ఆర్నెళ్లు ఆ జైళ్లనే గడిపినం. ఐదుగురం నిర్మల్ జిల్లా కడెం మండలం లింగాపూరోళ్లమైతే, పక్కూరు ఒకతనిది.

***

నెల.. రెణ్నెళ్లు.. మూణ్నెళ్లు... చూసీ చూసీ మా ఇంటి ఆడోళ్ల కండ్లు కాయలు గాసినట్టున్నయి. ఊరి లీడర్లను వట్టుకొని రాష్ట్రంల ఉన్న కాంగ్రెస్ పార్టీ, సంటర్ల ఉన్న బీజేపీ నాయకుల సుట్టు తిరిగీ తిరిగీ కాళ్ల చెప్పులనరిగినయట గనీ, వాళ్ల కండ్లల్ల నీళ్లు మాత్రం కారుడాగలె. కాంగ్రెస్ మంత్రి సీతక్క, బీజేపీ ఎంపీ గోడం నగేశ్‌ల దగ్గరికి వొయి దరఖాస్తులు వెట్టుకుంటే, ఆ వార్తా అన్ని పేపర్లల్ల అచ్చిండట గనీ, మేం మాత్రం మా ఇంటికి రాలె, మావోళ్లు మా కండ్లకు కనవడలె. ఇగ మా ఆడోళ్లకు వశపడక కేటీఆర్ సారైతనే మమ్మల్ని ఇంటికి తీస్కొస్తడని నమ్మి భూక్యా జాన్సన్ నాయక్ సార్ దగ్గర్కి వో